సాక్షి
గుంటూరు
గురువారం । 19 । అక్టోబర్ । 2023



మహాలక్ష్మీదేవి అలంకారం

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లిఖార్జునపేటలోని గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి గుడిలో బుధవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



బండ్లమ్మవారి సేవలో ఎమ్మెల్సీ

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ జనార్దనరెడ్డి, ఏపీ ట్రాన్స్‌పోర్ట్ జేసీ కృష్ణవేణి దర్శించుకున్నారు.

మహాలక్ష్మీదేవిగా వీర్ల అంకాలమ్మ



కారెంపూడి: దసరా మహోత్సవాలలో భాగంగా కారెంపూడిలో వీర్ల అంకాలమ్మ తల్లి బుధవారం మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తల్లికి నగదుతో అలంకారం చేశారు.

రాజకీయ జలగలు

- ప్రతిపక్షంలో ఉంటేనే రైతులు గుర్తొస్తారు
- అధికారంలో ఉంటే సాగునీటి కష్టాలు పట్టవు
- కర్షకులను మోసపుచ్చేందుకు టీడీపీ మార్క్ కుతంత్రాలు
- సాగునీటి సక్రమ సరఫరాకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధ కృషి



టీడీపీ హయాంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో మోదుకూరు వద్ద తుంగభద్ర సైడ్ చానల్ నుంచి మోటార్లతో నీటిని తోడుతున్న రైతులు చిత్రంలో రైతు నాయకుడు నాగిరెడ్డి, మేరుగ నాగార్జున(ఫైల్)

తెనాలి: వర్షాభావ పరిస్థితులు నెలకొని జలాశయాల్లో నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, జలవనరులశాఖ అధికారులు అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా సరఫరా చేస్తున్నారు. నీరందక ఏ ఒక్క రైతు పొలం దెబ్బతినకుండా చూడాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతున్నారు. అయితే ప్రతిపక్ష టీడీపీ నేతలు మాత్రం సాగునీటిపై రాజకీయం చేస్తున్నారు. ఓట్ల కోసం జలగల్లా మారి రైతులను పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. అధికారంలో ఉన్నపుడు రైతుల కష్టాలను పట్టించుకోని వీరు, ప్రతిపక్ష నేతలుగా కర్షకులను ఆందోళనకు పురిగొల్పుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రిపైనా విషం చిమ్ముతున్నారు. హైలెవల్ చానల్ పరిధిలో ఆయకట్టుకు నీటి సరఫరాపై టీడీపీ నేతల ధర్నా దీనికో నిదర్శనం.

వర్షాభావంతో తక్కువ నీటి నిల్వలు

కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలోని హైలెవెల్ చానల్ రైతుల దుఃఖదాయిని అని తెలిసిందే. దుగ్గిరాల మండలం పెదవడ్లపూడి దగ్గర పశ్చిమడెల్టా ప్రధాన కాలువ నుంచి చీలే ఈ కాలువ పరిధిలో చిన వడ్లపూడి, చిలువూరు, కంఠంరాజుకొండూరు, పెనుమూలి, నంబూరు, కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో 26,414 ఎకరాల ఆయకట్టు ఉంది. పశ్చిమడెల్టాకు గరిష్టంగా నీటి సరఫరా ఇచ్చిన రోజుల్లోనే హైలెవల్ చానల్ చివరి భూములకు నీరందుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో చానల్ చివరి భూములకు నీటి ఎద్దడి అనివార్యం. ప్రస్తుత సీజన్‌లో వర్షపాతం తక్కువని తెలిసిందే. ఆగస్టులో సాధారణం కన్నా 62 మిల్లీమీటర్లు తక్కువ, సెప్టెంబరులో 57 మిల్లీమీటర్లు ఎక్కువ వర్షపాతం నమోదైంది. అక్టోబరులో పరిస్థితి దారుణంగా ఉంది. సాధారణ వర్షపాతం 202.3 మిల్లీమీటర్లకు గాను ఇప్పటివరకు కేవలం 14.5 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం పడింది. పొరుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా ఉండటంతో జలాశయాల్లోనూ నీరు తక్కువైంది.

ప్రభుత్వం కట్టుదిట్ట చర్యలు

అయినా కృష్ణాపశ్చిమడెల్టాలోని గుంటూరు జిల్లాలో సాగులో ఉన్న 1.84 లక్షల ఎకరాల ఆయకట్టుకూ ప్రభుత్వం సాగునీటిని సరఫరా చేస్తోంది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల జలాశయం నుంచి 5,000 క్యూసెక్కులకు అదనంగా మరో 1,000 క్యూసెక్కులను విడుదల చేస్తోంది. ప్రణాళికాబద్ధంగా అన్ని కాల్వలకూ సాగునీటిని సరఫరా చేస్తోంది.

హైలెవల్ చానల్‌కు 377 క్యూసెక్కులు

ఈ క్రమంలో హైలెవెల్ చానల్‌కు 377 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తోంది. చానల్‌కు గల ఇతర పంట కాల్వల్లో కొన్ని పల్లపు భూములకు నీరు ఎక్కువగా వెళుతున్నందున చివరి భూములైన కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల పంటపొలాలకు తక్కువగా వస్తోంది. డెల్టాలో కీలకమైన వరి పైరు పొట్ట పోసుకునే కీలక దశలో ఈ పరిణామం రైతులను ఆందోళనకు గురిచేయటం సహజం. దీనిని ఎలా అధిగమించగలమనే అంశంపై ఇప్పటికే జలవనరులశాఖ అధికారులు కార్యాచరణలో ఉన్నారు. ఈలోగానే టీడీపీ నేతలు రైతుల పేరుతో తెనాలి మండల గ్రామం నందివెలుగు వద్ద తెనాలి-విజయవాడ రహదారిపై ఆదివారం ధర్నా చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే సేవ్ డెల్టా నినాదం

టీడీపీ నేతలు ప్రతిపక్షంలో ఉన్నపుడు మాత్రమే 'సేవ్ డెల్టా' నినాదం ఎత్తుకుంటున్నారు. ఊరేగింపులు, ధర్నాలు, రౌండ్ టేబుల్ సమావేశాలతో హడావుడి చేస్తున్నారు. దీనిని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ట్రేడ్‌మార్క్ రాజకీయంగా జనం చెప్పుకుంటారు. కాంగ్రెస్ హయాంలో పులిచింతల రిజర్వాయర్ కట్టాలంటూ తెనాలి, గుడివాడ తదితర ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు జరిపారు. ఎన్నారైల మద్దతును కూడగట్టారు. తీరా 1999లో టీడీపీ అధికారంలోకి వచ్చాక పులిచింతలను మర్చిపోయారు. అలాగే గత ప్రభుత్వంలో హైలెవెల్ చానల్ ఆయకట్టు రైతుల కష్టాలను పట్టించుకోకుండా తీరా 2019 ఎన్నికలకు ముందు పెదవడ్లపూడి వద్ద ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఆరంభ పనులతోనే వదిలేసి వెళ్లారు. వీటన్నిటినీ రైతులు, సామాన్య జనం గుర్తు చేసుకుంటున్నారు. టీడీపీ నేతలను రాజకీయ 'జల'గలుగా అభివర్ణిస్తున్నారు.

టీడీపీ హయాంలో పంటను తగలబెట్టుకున్న రైతులు

ఇదే టీడీపీ నేతలు ప్రజాప్రతినిధులుగా ఉన్న 2014-19 మధ్యకాలంలో హైలెవెల్ చానలే కాదు మొత్తం పశ్చిమడెల్టా ఆయకట్టు రైతులు తీవ్ర సాగునీటి కష్టాలు అనుభవించారు. 2015లో పంట ఆరంభం నుంచి చేతికొచ్చే తరుణంలోనూ నీరు అందించలేక టీడీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయనేలేదు. ధాన్యం దిగుబడికి భారీగా గండిపడింది. హైలెవల్ చానల్ పరిధిలోని ఖాజీపేటలో వరిపైరు నిలువునా ఎండిపోయింది. పెట్టుబడి ఖర్చులు కూడా రావన్న బాధతో ఖాజీపేట రైతులు ఆ ఏడాది నవంబరులో చేలోనే పంటను తగులబెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం గణాంకాల ప్రకారం 2015లో గుంటూరు జిల్లాలో 59 మంది రైతులు/కౌలురైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

- 2016లోనూ నీటి కష్టాలు డెల్టాను వెన్నాడాయి. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పంట కాలువలోని నీటిని మరో బ్రాంచి కాల్వలోకి మోటార్లతో తోడుకున్నారు రైతులు. చుండూరు మండల గ్రామం మోదుకూరు వద్ద తుంగభద్ర సైడ్ చానల్ నుంచి సమీప 2వ నంబరు బ్రాంచి కాల్వలోకి 10 నుంచి 15 మోటార్లు పెట్టి నీరు తోడుకున్నారు. పక్కనే గల మరో కాల్వలోనూ ఇదే వరస. ఆ ఏడాది



టీడీపీ హయాంలో 2015 నవంబరు 13న ఖాజీపేటలో ఎండిన వరిపైరును చేలోనే తగులబెట్టిన రైతులు (ఫైల్)

ఆగస్టు నెలలోనే దాదాపు 20 రోజులకు పైగా అన్నదాతలు కష్టాలు పడి మరీ పంటను దక్కించుకున్నారు. చెప్పుకుంటూ పోతే ఇలాంటి ఉదాహరణలెన్నో!

మహాలక్ష్మీ నమోస్తుతే



విజయవాడ : సిరులొలికే మహాతల్లి, జగజ్జనని దివ్య సన్నిధి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతున్నాయి. విద్యుద్దీప కాంతులతో దేవస్థానం శోభాయమానమై కాంతులీనుతోంది. అశేష భక్తజనంతో ఇంద్రగిరి కిటకిటలాడుతోంది. నాలుగో రోజు బుధవారం కనకదుర్గమ్మ మహాలక్ష్మిగా భక్తులను కటాక్షించారు. అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని తిలకించి భక్తులు పులకించారు. సర్వ దర్శనంతోపాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో భక్తులు బారులుతీరి కనిపించారు. తెల్లవారు జామున నాలుగు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం కాగా రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున రద్దీ అధికంగా కనిపించింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రద్దీ ఓ మోస్తరుగా ఉంది. మరో వైపు వీఐపీలను సైతం టికెట్లు ఉంటేనే కొండపైకి అనుమతించారు. అమ్మ వారికి నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చన మొదటి షిఫ్టులో 146 మంది, రెండో షిఫ్టులో 107 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక ఖడ్గ మాలార్చన, ప్రత్యేక చండీ హోమం, ప్రత్యేక శ్రీచక్ర నవార్చన పూజల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అర్చకులు అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ అన్నపూర్ణాదేవి అలంకార విశిష్టతను వివరించారు. జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయం, శ్రీకోదండ రామస్వామిదేవస్థానాలలో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి.

నేడు 19 చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నరసరావుపేట: జిల్లాలో గురువారం 19 ప్రదేశాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి బుధవారం సాయంత్రం పేర్కొన్నారు. అమరావతి మండలం అత్తలూరు పీహెచ్‌సీ దిడుగు గ్రామంలో, అచ్చంపేట మాదిపాడు పీహెచ్‌సీ తాళ్లచెరువు, పెదకూరపాడు 75తాళ్లూరు పీహెచ్‌సీ లింగంగుంట్ల, పిడుగురాళ్ల కరాలపాడు పీహెచ్‌సీ చెన్నాయపాలెం, రొంపిచర్ల రెడ్డిపాలెం పీహెచ్‌సీ అన్నవరంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సత్తెనపల్లి ఫణిదెం పీహెచ్‌సీ పరిధిలోని రెంటపాళ్ల, శావల్యాపురం పీహెచ్‌సీ పొట్లూరు, వేల్పూర్తి శిరిగిరిపాడు పీహెచ్‌సీ కొత్త పుల్లారెడ్డిపురంలో శిబిరాలు జరుగుతాయని వివరించారు. వినుకొండ ఏనుగుపాలెం పీహెచ్‌సీ నరగాయపాలెం, చిలకలూరిపేట యూపీహెచ్‌సీ సుగాలి కాలనీలో, నరసరావుపేట షాలెంనగర్ పీహెచ్‌సీలో, సత్తెనపల్లి యుపీహెచ్‌సీ వడ్డవల్లి కాలనీలో, దాచేపల్లి యుపీహెచ్‌సీలో సురక్ష వైద్యశిబిరాలు ఉంటాయని వెల్లడించారు.

యార్డులో 25,832 బస్తాల మిర్చి విక్రయం




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 24,728 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 25,832 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,600 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,112 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.3,900, మోడల్ ధర రూ.2,900 వరకు పలికింది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 216, బ్యాంక్ కెనాల్‌కు 1,021, తూర్పు కెనాల్‌కు 480, పశ్చిమ కెనాల్‌కు 154, నిజాంపట్నం కాలువకు 255, కొమ్మమూరు కాల్వకు 1,630 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెడుతున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, బీఓఎస్ చైర్మన్‌లు, ఆయా విభాగాధిపతుల సమావేశంలో వీసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సులను నాలుగేళ్ల కాల వ్యవధితో నిర్వహిస్తామన్నారు. ఈ ఆనర్స్ డిగ్రీ కోర్సును రెండు విభాగాలుగా విభజించినట్లు తెలిపారు. గతంలో డిగ్రీ కోర్సులు చదివేవారు మూడు సబ్జెక్టులను ఎంచుకొని డిగ్రీ కోర్సును పూర్తి చేసేవారు. అయితే ప్రస్తుతం వచ్చిన మార్పుల్లో ఒకే సబ్జెక్టు మీద మూడేళ్ల డిగ్రీ చదివి నాలుగో ఏడాది ఆనర్స్ బై రీసెర్చ్ కింద చేరే అవకాశాలు కల్పించనున్నామని చెప్పారు. మూడేళ్ళలో డిగ్రీలో 75 శాతం మెరిట్ ఉన్న వారికి మాత్రమే ఆనర్స్ బై రీసెర్చ్‌లో ప్రవేశాలు కల్పించనున్నామని తెలిపారు. ఇది ఏడాదికి రెండు సెమిస్టర్ల విధానంలో జరుగుతుందన్నారు. 4వ ఏడాది మొదటి సెమిస్టర్‌లో రీసెర్చ్ మెథడాలజీ వంటి అంశాల మీద అభ్యసనం, రెండవ సెమిస్టర్‌లో అభ్యర్థి ఎంచుకున్న అంశంపై ప్రాజెక్టును సమర్పించాల్సి ఉంటుందని, వీటిలో మెరిట్ సాధించిన అభ్యర్థులు పీజీ అడ్మిషన్ల విభాగానికి దరఖాస్తు చేసుకుంటే నేరుగా పరిశోధన చేసే అవకాశాన్ని పొందుతారని వీసీ వివరించారు. త్వరలోనే అన్ని సబ్జెక్టులకు సంబంధించి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లతో సిలబస్ రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులో మొదటి ఏడాది అన్ని కోర్సుల విద్యార్థులకు కామన్ సిలబస్ ఉంటుందని, రెండవ, మూడవ ఏడాది అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుకు అనుగుణంగా బోధన ఉంటుందన్నారు. నాలుగవ ఏడాది వచ్చేసరికి ఆనర్స్ బై రీసెర్చ్‌లో విద్యార్థి ప్రవేశం ఉండనుందని వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త మార్పులతో విద్యార్థులకు కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అలాగే పరిశోధన వైపు ఆసక్తి చూపే వారికి నిబంధనల మేరకు పీహెచ్‌డీలు చేసే వీలును ఆయా విభాగాలు అవకాశం కల్పిస్తాయని వివరించారు. ఈ సమావేశంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి, సీడీసీ డీన్ ఆచార్య కె. మధుబాబు, పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత, డిగ్రీ పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య సంధ్య కోల్, యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కాలర్ ఎగరేసేలా జగనన్న పాలన

- నాలుగున్నరేళ్లలో 98 శాతం హామీలు నెరవేర్చాం
- 26 నుంచి తెనాలి వేదికగా సామాజిక బస్సు యాత్ర ప్రారంభం
- తాడికొండ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, వేదికపై ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్ తదితరులు

తాడికొండ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత మన ప్రభుత్వానిదని, ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసేలా జగనన్న పాలన ఉందని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చెప్పారు. బుధవారం తాడికొండలోని షిర్డీసాయి పర్తిసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన సామాజిక బస్సు యాత్ర సన్నాహక నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో అయోధ్యరామిరెడ్డి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈనెల 26 నుంచి సామాజిక బస్సు యాత్ర తెనాలి నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పనిచేసిన నాయకులు, కార్యకర్తలే పార్టీకి పునాది అని, పార్టీ కోసం కష్టపడి నష్టపోయిన వారు ఉన్నారని, వారందరికీ తప్పక న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని, ఈ విషయాన్ని సామాజిక బస్సు యాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్నివర్గాలకు సమన్యాయం చేసిన జగనన్న వారిని ఆర్థికంగా బలవంతులను చేశారనడంలో సందేహం లేదన్నారు. పేదలకు అండగా నిలిచే పార్టీ వైఎస్సార్ సీపీ అని, అందరూ కలిసికట్టుగా పనిచేసి 2024లో పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమని చెప్పారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శం అన్నారు. అంబేడ్కర్ కన్న కలలు ఏపీలో సఫలీకృతమవుతున్నాయనడంలో సందేహం లేదన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత జగనన్నదేనని స్పష్టం చేశారు. ఇంగ్లిషు మీడియం విద్యతో పేద పిల్లలు భవిష్యత్తులో విదేశాల్లో డాలర్ల పంట పండించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం, మేడికొండూరు జెడ్పీటీసీలు దాసరి కత్తిరేణమ్మ, మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న, తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ కె.ఏడుకొండలు, పార్టీ మండల అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, తాళ్ళూరి వంశీ, కొప్పుల శేషగిరిరావు, జేసీఎస్ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడీ రూటే సప'రేటు'!

- జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌పై అవినీతి ఆరోపణలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే ముస్తఫా
- పోస్టుల భర్తీలో మామూళ్ల వసూళ్లపై ఫిర్యాదులు
- గతంలోనూ ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్!

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) చింతలపూడి నాగేశ్వరరావుపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన రూటే సప'రేటు' అంటూ పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఏకంగా ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ఏడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారంటే విషయం తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నాగేశ్వరరావుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఈనెల 13న కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో పోస్టులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తీ చేయకుండా ప్రతిష్టను దిగజారుస్తున్నట్లు ఆరోపించారు. కొంతమంది వద్ద డబ్బులు దండుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జీజీహెచ్ నుంచి అతనిని మరో ప్రాంతానికి మార్చాలని, గతంలోనూ ఈయన అవినీతి ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ అయ్యారని వివరించారు. రెగ్యులర్ ఉద్యోగుల ప్రమోషన్లలోనూ ఏడీ ఇష్టానుసారంగా వ్యవహరించారని పలువురు ఉద్యోగులు, యూనియన్ నేతలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులపై విచారణ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదని జీరో పాలసీ విధానంలో ప్రతినెలా ఖాళీలన్నీ భర్తీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొన్ని పోస్టులను కుంటిసాకులు చూపుతూ నెలల తరబడి ఏడీ భర్తీ చేయడం లేదని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ కాంట్రాక్టర్లకు బిల్లుల మంజూరు, ఉద్యోగుల ఫైల్స్ క్లియరెన్సు, స్టాఫ్‌నర్సుల భర్తీలో ఏడీ అవినీతికి పాల్పడ్డారని కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దానిపై విచారణ చేసి ఏడీని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీనిపై ఏడీ కోర్టుకు వెళ్లి మళ్లీ జీజీహెచ్‌కు వచ్చారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

ఏడీపై విచారణకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి తాజాగా ఆదేశాలు వచ్చాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు.

మహాలక్ష్మిగా భ్రమరాంబ



భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు బుధవారం భ్రమరాంబ మహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమార్చనలు, హారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాదాల వితరణ జరిగాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. ప్రతి నిత్యం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. – పెదకాకాని

మండలస్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారం

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- వట్టిచెరుకూరులో 'జగనన్నకు చెబుదాం'



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు రూరల్: మండల స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వట్టిచెరుకూరు మండల కేంద్రం జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ జేసీ జి.రాజకుమారి, ఆర్డీఓ ప్రభాకరరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి 41 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని వివరించారు. పెండింగ్ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి గోపీకృష్ణ, డీడీ సోషల్ వెల్ఫేర్ మధుసూదనరావు, డీఈఓ శైలజ, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రావణబాబు, డీపీఓ కేశవరెడ్డి, డీసీఓ వీరాచారి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, తహసీల్దార్ నాసరయ్య, ఎంపీడీఓ శేషగిరిరావు, పంచాయతీ సెక్రటరీ రామకోటయ్య పాల్గొన్నారు.

మరణించిన వారి పేర్లు ఓటర్ల లిస్టులో ఉండకూడదు

గుంటూరు వెస్ట్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన ప్రధాన బాధ్యత మనపై ఉందని, ఈ క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. నాయకులు చెప్పే అంశాలను ఎన్నికల మార్గదర్శకాలకు లోబడి పరిష్కరిస్తామన్నారు. మరణించిన వారి ఓట్లను మొత్తం తొలగించాలన్నారు. ఈవీఎంల మొదటి దశ తనిఖీ జరుగుతోందన్నారు. కలెక్టర్ వివరించారు సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ సుజాత, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.



'ధన'లక్ష్మీ..

మంగళగిరి: దేవీ శరన్నవ రాత్రుల మహోత్సవాలలో భాగంగా నగరంలోని పార్కు రోడ్డు ఒకటో లైనులో ఏర్పాటు చేసి అమ్మవారిని రూ.5లక్షలతో అలంకరించారు. బుధవారం అమ్మవారు ధనలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మిలటరీ ట్రక్ ప్రమాదంలో ఖాజీపేట సిపాయి మృతి

- ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకోనున్న భౌతికకాయం
- రోడ్డుమార్గంలో స్వస్థలం ఖాజీపేటకు
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



చిటుమడుగుల వాసుకిషోర్ (ఫైల్)

తెనాలి/తెనాలిటౌన్: మిలటరీ ట్రక్‌కు జరిగిన ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న సిపాయిల్లో ఒకరైన రూరల్ మండలం ఖాజీపేటకు చెందిన చిటుమడుగుల వాసుకిషోర్ (29) కన్నుమూశాడు. దాదాపు 17 రోజులు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. 'సైన్యంలో చేరాలన్న ఆశయాన్ని నెరవేర్చుకున్నా, మృత్యువు అతడిని మధ్యలోనే ప్రమాదం రూపంలో బలితీసుకుంది' అని వాసుకిషోర్ స్నేహితులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో చంపత్ బెటాలియన్‌లో సిపాయిగా పనిచేస్తున్న వాసుకిషోర్ ఈనెల ఒకటిన మిలటరీ ట్రక్కులో వెళుతుండగా, రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని లక్నోలోని ఆసుపత్రిలో చేర్చారు. అయినా ప్రయోజనం లేకపోవటంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఇచ్చిన సమాచారంతో అతడి భార్య నవీన, ఆమె తల్లి అక్కడకు వెళ్లారు. ఇప్పుడు వాసుకిషోర్ భౌతికకాయాన్ని ఇండిగో విమానంలో పంపారు. గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో విమానం హైదరాబాద్‌కు చేరుకుంటుంది. అక్కడ్నుంచి రోడ్డుమార్గంలో ఖాజీపేటకు చేరుస్తారు. అనంతరం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు చేయనున్నారు.

వాసుకిషోర్ తల్లిదండ్రులు సామ్రాజ్యం – వెంకటేశ్వర్లు వ్యవసాయ కూలీలు. ముగ్గురు సంతానంలో చివరివాడు కిషోర్. పదోతరగతి వరకు చదివాడు. సైన్యంలోకి వెళ్లాలని ఉబలాటపడ్డాడు. అనుకున్నట్టే 2015లో సైన్యంలోకి ఎంపికయ్యాడు. ఉద్యోగంలో కుదురుకున్నాక అయిదేళ్ల క్రితం వివాహం చేశారు. మూడేళ్ల పాప ఉండగా, 45 రోజుల క్రితమే మరో పాప జన్మించింది. రెండో కూతుర్ని చూసుకునేందుకని గత నెలలోనే కిషోర్ వచ్చివెళ్లాడు. తన విశేషాలన్నీ చెపుతూ చాలా సంతోషంగా ఉన్నాడనీ, అంతలోనే ఇలా భౌతకంగా దూరమవుతాడని కలలో కూడా అనుకోలేదని స్నేహితులు విచారంతో అన్నారు. కిషోర్ తల్లిదండ్రుల దుఃఖానికి అంతేలేదు. సైన్యంలో చేస్తూ దూరంగా ఉంటున్నా, దేశసేవలో ఉన్నాడని సంతోషించామని, ప్రమాదం ఇలా బలి తీసుకుంటుందని ఊహించలేదని వారు వాపోతున్నారు.

20, 21 తేదీలలో కేఎల్‌యూలో జాతీయ సాంకేతిక సదస్సు



'సమ్యక్ ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేఎల్ వర్సిటీ బాధ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ ఈ నెల 20,21 తేదీలలో వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో జరుగుతుందని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. విజయవాడ మ్యూజియం రోడ్డులోని కేఎల్ పరిపాలన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సాంకేతిక సదస్సుకు దేశవ్యాప్తంగా ఆయా కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన 15 వేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు, విద్యార్థుల ప్రదర్శనలతో రెండు రోజుల పాటు ఈ సదస్సు పండుగలా సాగుతుందన్నారు. 12 ఏళ్లుగా కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు వారసత్వంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సమ్యక్‌కు చైర్మన్‌లుగా డాక్టర్ ఎ.శ్రీనాథ్, డాక్టర్ బి.జయకుమార్ సింగ్, కన్వీనర్‌లుగా డాక్టర్ ఎం.సుమన్, డాక్టర్ టి.పవన్‌కుమార్, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ పి.వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారని తెలిపారు.

రేపటి నుంచి వీణా అవార్డులు

తృతీయ జాతీయ పద్యనాటక/ సాంఘిక నాటికల పోటీలు

తెనాలి: కళల కాణాచి-తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్తంగా వీణా అవార్డ్స్ పేరుతో నిర్వహిస్తున్న తృతీయ జాతీయస్థాయి పద్య నాటక, సాంఘిక నాటికల పోటీలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. గత రెండేళ్లుగా పద్యనాటక పోటీలు, సాంఘిక నాటికల పోటీలను వేర్వేరుగా నిర్వహిస్తున్న సంస్థలు, ఈసారి రెండింటిని కలిపి పోటీలను జరపటం విశేషం. 24వ తేదీ వరకు అయిదు రోజులపాటు ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే ఈ పోటీల్లో ప్రత్యేక ప్రదర్శనలుగా సాంఘిక నాటకాలకు స్థానం కల్పించటం మరో విశేషం. వచ్చే ఏడాది నుంచి సాంఘిక నాటకాలను కూడా పోటీల్లో చేరుస్తామని కళల కాణాచి వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా చెప్పారు. పోటీల వివరాలకొస్తే. తొలిరోజైన 20వ తేదీ ఉదయం 9.45 గంటలకు ప్రముఖ రంగస్థల కళాకారిణి బుర్రా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలన, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనల తదుపరి 10.30 గంటలకు శ్రీకళానికేతన్, హైదరాబాద్ వారి 'వసంత రాజీయం', మధ్యాహ్నం 2 గంటలకు ఉషోదయ నాట్యమండలి, చెరుకుపల్లి వారి 'మోహినీ భస్మాసుర' పద్యనాటకాలను ప్రదర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'ఇంపోస్టర్స్' సాంఘిక నాటకం ప్రత్యేక ప్రదర్శన ఉంటుంది. 6.45 గంటలకు జరిగే సభలో ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు నెమలికంటి తారక రామారావుకు పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. పోటీల నాటక/నాటికలతో ముద్రించిన విపంచి పుస్తకాన్ని సంస్కృతి, గుంటూరు అధ్యక్షుడు సర్రాజు బాలచందర్ ఆవిష్కరిస్తారు. సభానంతరం 8.15 గంటలకు చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికను ప్రదర్శిస్తారు. 21న శ్రీవినాయక నాట్యమండలి, రేణిగుంటవారి 'మహారథి కర్ణ', శ్రీకళాధరి నటధామం, పాలకొల్లు వారి 'కారే రాజులు...రాజ్యముల్ కలుగవే' పద్యనాటకాలు, క్షీరసాగర మథనం సాంఘిక నాటకం, సాంఘిక నాటిక 'రాత' ఉంటాయి. 22న హైదరాబాద్ సమాజంచే 'శ్రీస్వామి అయ్యప్ప', కాకినాడ వారిచే 'నర్తనశాల' పద్యనాటకాలు, గుంటూరువారి 'ఇంద్రప్రస్థం' సాంఘిక నాటకం, హైదరాబాద్ వారి 'మాట్లాడుకుందాం' సాంఘిక నాటిక ప్రదర్శనలుంటాయి.

23న విశాఖపట్నం వారి 'శ్రీకాంత కృష్ణమాచార్య' పద్యనాటకం, 'జారుడు మెట్లు (ప్రత్యేక ప్రదర్శన), ఇబ్రహీంపట్నంవారి 'ఎనిమీ', 'మూల్యం' సాంఘిక నాటికలను ప్రదర్శిస్తారు. చివరిరోజైన 24న మధ్యాహ్నం 2.30కు సాంఘిక నాటిక 'ది గిఫ్ట్'తో ఆరంభిస్తారు. 4.15కు గుంటూరు వారి 'అమృతహస్తం' నాటకం ఉంటాయి. ముగింపు సభలో ప్రముఖ రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ పౌరాణిక పద్యనటుడు పొన్నాల రామసుబ్బారెడ్డికి ప్రదానం చేస్తారు.

జిల్లా పరిషత్ స్థలాల పరిశీలన



నిరుపయోగంగా ఉన్న గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

సత్తెనపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్‌కు చెందిన విలువైన స్థలాలను గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా బుధవారం పరిశీలించారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం పక్కన గల జిల్లా పరిషత్ స్థలంలో నిరుపయోగంగా ఉన్న జడ్పీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. దానిని వాడుకలోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల జడ్పీ స్థలంలో ఎంతోకాలంగా పేదలు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తుండటంతో ఆ స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురు జడ్పీ స్థలంలో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకొని పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్న నేపథ్యంలో అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ బసవకుమారి, జిల్లా పరిషత్ అధికారులు, తదితరులు ఉన్నారు.

తాడికొండ అడ్డరోడ్డులో జడ్పీ భూముల పరిశీలన...

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులోని జిల్లా పరిషత్ భూముల ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లాల జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా సూచించారు. బుధవారం ఆక్రమణదారుల వద్దకు స్వయంగా వెళ్లి మాట్లాడిన ఆమె జడ్పీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్ నిర్మాణం చేయాల్సి ఉందని, కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే తామే తొలగించాల్సి వస్తుందని తెలిపారు. తాడికొండ ఎంపీడీఓ అత్తోట దీప్తి, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, ఎస్‌ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో అలసత్వం తగదు



గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షల వైద్యశిబిరం వద్ద సీఎం వైఎస్ జగన్ ప్లకార్డులతో వైద్యపరీక్షల కోసం వచ్చిన గ్రామస్తులు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

- అనుమానాలను నివృత్తి చేసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం.. గుండె పదిలం
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ
- గుండవరంలో గుండెవ్యాధుల నిర్ధారణ పరీక్షల వైద్యశిబిరం



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

గుండవరం(చేబ్రోలు): ప్రాణాంతకమైన గుండె పోటుపై ప్రజలందరికీ సహజంగా భయం ఉంటుందని నిపుణులైన వైద్యులచే అనుమానాలను నివృత్తి చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించి గుండె పదిలంగా ఉంటుందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీ కృష్ణ పేర్కొన్నారు. 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం'.. మీ గుండె పదిలం కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు మండలం గుండవరం, గొడవర్రు గ్రామాల్లో బుధవారం గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా ఆలస్యం చేయకుండా సంబంధిత నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో అలసత్వం – ఆలస్యం తగదని, ఏ మాత్రం అనారోగ్య లక్షణాలు కనిపించినా వెనకడుగు వేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గుండె సంబంధిత సమస్యలపై జాప్యం జరిగితే ప్రాణం మీదకి తెస్తాయని అందుకే గుండె విషయంలో అన్ని రకాల సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మానసికంగా ధైర్యంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకుంటే, ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వారికి బజరంగ్ ఫౌండేషన్ వైద్య సహాయం చేస్తుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనాలను ఆచరణాత్మకంగా చేసి చూపెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అమలు జరుగుతున్న సంక్షేమ పాలన, ప్రభుత్వంపై గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ మరింతగా పెరిగేందుకు భజరంగ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. బజరంగ్ ఫౌండేషన్ బృందం గత రెండు రోజులుగా గుండవరం, గొడవర్రు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ వైద్య పరీక్షలకు గ్రామస్తులను సమాయత్తం చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ వైద్య శిబిరంలో 171 మంది హాజరై పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రి వారి సహకారంతో నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు 171 మంది గ్రామస్తులు హాజరు కాగా, వారిలో 35 మందికి యాంజియోగ్రామ్ ఆవశ్యకత ఉందని తేలిందన్నారు. వీరందరినీ గ్రామం నుంచి ఈ నెల 24వ తేదీన బజరంగ్ ఫౌండేషన్ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి విజయవాడ ఆసుపత్రికి తరలించి అక్కడ మెరుగైన చికిత్సలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రై కాన్ క్లినిక్స్, గుంటూరు వారి సహకారంతో గ్రామంలోని ప్రజలకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. బజరంగ్ సామాజిక సేవా విభాగ బృందం సభ్యులు పాల్గొని గ్రామస్తులపై ప్రత్యేక వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని ప్రతి ఒక్కరికి మానసిక స్థైర్యాన్ని, పరీక్షలపై సంసిద్ధతను పెంపొందించి వైద్య పరీక్షలు జరిపించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, పాల్గొన్నారు.

గుర్తుతెలియని ఇరువురు వ్యక్తుల మధ్య ఘర్షణ


ఒకరు మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పట్నంబజారు: ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రైల్వేస్టేషన్ రోడ్డులోని న్యూ అజంతా లాడ్జి వద్ద ఇద్దరు వ్యక్తులు రోడ్డుపైన బుధవారం ఉదయం ఒక వ్యక్తికి సంబంధించిన బ్యాగును మృతిచెందిన వ్యక్తి లాక్కునే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో మరో వ్యక్తి మృతిచెందిన వ్యక్తిని రాయితో తలపై బలంగా మోదడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వీఆర్‌ఓ ఎస్.సంగీతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

62 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని పట్టుకున్న ఎస్ఈబీ అధికారులు

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద రూ.6లక్షల విలువైన గంజాయిని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు తెలిపిన వివరాల మేరకు కాజ టోల్ ప్లాజా వద్ద బుధవారం వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో తరలిస్తున్న రూ.6లక్షల విలువైన 62 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఒడిశా నుంచి కేరళకు గంజాయి తరలిస్తున్న కేరళ రాష్ట్రం కొల్లాం జిల్లాకు చెందిన ముగ్గురు నిందితులు షిజు, శరత్, బుద్దాల రామకృష్ణలను అదుపులోకి తీసుకున్నామని, ఒడిశా నుంచి గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడు రోమాల గణేష్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో ఎస్ఈబీ అడిషనల్ సూపరింటెండెంట్ డీఎస్ మహేష్, ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

బెంగాల్‌పై హైదరాబాద్ జట్టు విజయం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో కల అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగిన వినూ మన్కడ్ అండర్ –19 పురుషుల క్రికెట్‌లో బెంగాల్ జట్టుపై హైదరాబాద్ జట్టు 27 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు 47.3 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మెన్ చిరాజ్ యాదవ్ 84 బంతులలో 3 సిక్స్‌లు, 3 ఫోర్లతో 62 పరుగులు సాధించగా మరో బ్యాట్స్‌మెన్ ఎ.అవినాష్ 43 బంతులలో 1 సిక్స్, 10 ఫోర్లతో 60 పరుగులు సాధించాడు. అనంతరం చేధనకు దిగిన బెంగాల్ జట్టు 48.01 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మెన్ అగ్నిశ్వర్ దాస్ 77 బంతులలో 4 ఫోర్లతో 57 పరుగులు సాధించాడు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
గురువారం ॥ 19-10-2023







• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు. అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది.

అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు





సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగిపోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
– తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లుగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు.



సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికివాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షౌలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షౌలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



● మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



● రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.
ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

● కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను



రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో

మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంపకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్ల తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.







కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాది'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.





వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.